క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్రం బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 50శాతం మార్కులు ఉన్నవారు అర్హులు అని, నీట్ సెట్, పీహెచ్‌డీతో పాటు బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4గంటల లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

రేపు 5కే రన్

నిడమనూరు: ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు, ఓటర్లను చైతన్యం చేసేందుకు నిడమనూరులో శనివారం ఉదయం 6గంటలకు 5కే (ఐ ఓట్ ఫర్ ష్యూర్) రన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ ఈ 5కే రన్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. ఎన్జీఓస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులతో పాటు మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొనాలని కోరారు.

నాయబ్ తహసీల్దార్‌కు పదోన్నతి


హరికృష్ణ

నిడమనూరు: నిడమనూరు తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్(ఎలక్షన్)గా పనిచేస్తున్న ఎస్. హరికృష్ణకు తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. గతంలో హాలియాలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించిన హరికృష్ణ సంవత్సరం క్రితం నిడమనూరుకు బదిలీపై వచ్చి నాయబ్ తహసీల్దార్ (ఎలక్షన్)గా పనిచేస్తున్నారు. ఇప్పుడు పదోన్నతిపై మఠంపల్లి తహసీల్దార్‌గా బదిలీ కావడంతో ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దేవరకొండ: పెద్దఅడిశర్లపల్లి మండలానికి చెందిన 93 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను దేవరకొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, వల్లపురెడ్డి, నర్సింహ, పరమేశ్, శేఖర్‌రెడ్డి, నరేందర్, చందు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణకు వేలం

నిడమనూరు: మండలంలోని కోటమైసమ్మ గుడి వద్ద లడ్డూ ప్రసాదం విక్రయించేందుకు, కొబ్బరి చిప్పల సేకరణకు గురువారం అధికారులు వేలం నిర్వహించారు. కొబ్బరి చిప్పల సేకరణ కోసం ఆరుగురు వేలంలో పాల్గొనగా.. సైదిరెడ్డి రూ.52వేలకు దక్కించుకున్నారు. లడ్డూ ప్రసాదం విక్రయించుకునేందుకు నిర్వహించిన వేలంలో ఎనిమిది మంది పాల్గొనగా.. నన్నెబోయిన రాజుయాదవ్ రూ.22వేలకు దక్కించుకున్నారు. 2023 ఆగస్టు 18 నుంచి 2024 ఆగస్టు 17వ తేదీ వరకు వీరికి లడ్డూ ప్రసాదం విక్రయించేందుకు, కొబ్బరి చిప్పల సేకరించేందుకు హక్కు ఉంటుంది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మిర్యాలగూడ డివిజన్ పరిశీలకుడు రమేష్, ఆలయ ట్రస్టీ ఆంజనేయులు, ఈఓ నవీన్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులు మేపుకునేందుకు అనుమతించాలి

చందంపేట: నల్లమల అటవీ ప్రాంతంలో పశువులను మేపుకునేందుకు అటవీ శాఖ అధికారులు అవకాశం కల్పించాలని కోనేరు సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ హుస్సేన్ అటవీ శాఖ అధికారులను కోరారు. గురువారం మండలంలోని రేకలగడ్డ గ్రామంలో పాడి రైతులు, గొర్రెల పెంపకందారులతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశుగ్రాసం కొరత తలెత్తున్నందున నల్లమల అటవీ ప్రాంతంలో మేపుకునేందుకు అనుమతించాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ లక్ష్మమ్మ, అటవీ శాఖ చైర్మన్ ఎలుక జగన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, నర్సయ్య, పగడాల వెంకటయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ


ఇసుకబావిగూడెంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మాడుగులపల్లి: మండలంలోని ఇందుగుల, ఇసుకబావిగూడెం గ్రామాల్లో బోనాల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించారు. ఆయా గ్రామాల్లో సందడి వాతావరణ కనిపించింది. కార్యక్రమంలో ఇసుకబావిగూడెం సర్పంచ్ నిమ్మల గోవిందమ్మ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తంగెళ్ల సీతారాంరెడ్డి, కేతనపల్లి ఎల్లారెడ్డి, పుట్ట భిక్షం, మేడి సుందర్, రేణుక, జాహెద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి సామాజిక సేవ

- 2015 నుంచి మన్నెం రంజిత్ యువసేన పేరుతో సేవా కార్యక్రమాలు
- ఉన్నత చదువులు చదివేందుకు పేద విద్యార్థులకు చేయూత
- కరోనా క్లిష్ట పరిస్థితుల్లో సైతం నిత్యావసర వస్తువుల పంపిణీ

నిడమనూరు: సేవ చేయాలనే మనసు ఉంటే చాలు మార్గాలు ఎన్నో ఉంటాయి అని నిరూపిస్తున్నాడు నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన మన్నెం రంజిత్‌యాదవ్. ఉన్నత విద్యావంతుడైన రంజిత్‌యాదవ్ విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి సొంతూరులో పేదలకు తనవంతుగా ఏదైనా చేయాలనే ఆశయంతో తిరిగి వచ్చి నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.

మన్నెం రంజిత్ యువసేన పేరుతో..

మన్నెం రంజిత్ యువసేన పేరుతో 2015 నుంచి రంజిత్‌యాదవ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదని వారికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారు. నోట్‌బుక్స్, ఆరోగ్య కిట్స్ అందించారు. ఎంబీబీఎస్, ఐఐటీల్లో చదివే వారితో పాటు గ్రూప్స్‌కు ప్రిపేరయ్యే వారికి ఫీజులు చెల్లించారు. రంజిత్ ఆర్థిక సహాయ, సహకారాలతో చాలా మంది విద్యార్థులు చదువు ఆపి వేయకుండా కొనసాగిస్తూ వస్తున్నారు.


పెద్దవూరలో దివ్యాంగుడికి ఆర్థికసాయం అందజేస్తున్న రంజిత్‌యాదవ్ (ఫైల్)

అదేవిధంగా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలకు వైద్యం కోసం సహాయం చేస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. కుటుంబ పెద్ద మృతిచెందిన కుటుంబాలు ఇబ్బంది పడకుండా వారికి ఆర్థికంగా భరోసా అందిస్తున్నారు. కరోనా సమయంలో ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా లాక్‌డౌన్ సమయంలో తాను విదేశాల్లో ఉండిపోవాల్సి వచ్చినా, ఇక్కడి వారికి నిత్యావసర సరుకులను ఇంటింటికి తన మనుషుల ద్వారా పంపిణీ చేయించి మంచి మనసును చాటుకున్నారు. ఎర్రబెల్లి ఎంపీటీసీ పరిధిలో ప్రతి ఇంటికి లాక్‌డౌన్ సమయంలో నిత్యావర సరుకులను పంపిణీ చేయించారు. అంతేకాకుండా మాస్కులు, శానిటైజర్లను అందించి కరోనా బారిన పడకుండా చూశారు. యువకుల్లో, శారీరక, మానసిక దృఢత్వం ఎంతో అవసరమని గ్రామాల్లో క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు ఇస్తూ వస్తున్నారు. అంతేకాకుండా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా ప్రజలకు తనవంతుగా సేవలు అందించడానికి ఇంకా మంచి వేదిక కోసం మన్నెం రంజిత్‌యాదవ్ చూస్తున్నారు.


నిడమనూరులో ఇల్లు దగ్ధమైన కుటుంబానికి సాయం అందజేస్తున్న రంజిత్‌యాదవ్ (ఫైల్)

స్వచ్ఛందంగా ప్రజా సేవ



స్వచ్ఛందంగా ప్రజా సేవ చేస్తున్నాను. ఒకవేళ నేను చేస్తున్న సేవలు చూసి రాజకీయంగా అవకాశం వస్తే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. 2015 నుంచి సేవలు అందిస్తున్నందున మరింత ఎక్కువ సేవలు అందించడానికి రాజకీయ వేదిక ఉపయోగపడతుందని భావిస్తున్నాను.

– మన్నెం రంజిత్‌యాదవ్, నిడమనూరు

గొర్రెల కాపరిని చితకబాదిన బీట్ ఆఫీసర్

- అటవీ శాఖ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ధర్నా
- వైద్య ఖర్చులకు రూ.40వేలు ఇచ్చేందుకు అంగీకరించిన సదరు అధికారి

చందంపేట: ఓ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పశువుల కాపరిపై లాఠీతో విరుచుకుపడ్డాడు. గ్రామస్తుల ఆందోళనతో దిగిన వచ్చిన సదరు అధికారి చితబాదిన చేతులతోనే చికిత్స నిమిత్తం రూ.40వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన గునుగుంట్ల తిరుపతయ్య బుధవారం గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో తన గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లాడు. సాయంత్రం చిత్రియాల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మేత కోసం గొర్రెలను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లడం ఏమిటని తిరుపతయ్యను అడ్డుకొని తన చేతిలో ఉన్న లాఠీతో చితకబాదాడు. దీంతో స్పృహ కోల్పోయిన తిరుపతయ్య కొద్దిసేపటి తర్వాత తేరుకొని ఇంటికి చేరుకొని జరిగిన విషయం కుటుంబ సభ్యులు తెలియజేశాడు. దీంతో వెంటనే అతడిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బీట్ ఆఫీసర్ తీరు పట్ల ఆగ్రహించిన గ్రామస్తులు గురువారం దేవరకొండలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో తిరుపతయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం సదరు బీట్ ఆఫీసర్ రూ.40వేలు చెల్లించేందుకు అంగీకరించినట్లు సమాచారం.


గాయాలతో ఇంటికి చేరుకున్న తిరుపతయ్య

సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ

మిర్యాలగూడ అర్బన్: సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ పిలుపునిచ్చారు. గురువారం మిర్యాలగూడలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా నాట్యమండలి కళాకారుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాలకులు దేశంలో మతం, కులం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రజా నాట్యమండలి కళాకారులకు ఉందని అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరశురాములు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, కుమ్మరి శంకర్, సీనియర్ కళాకారులు పోలేని నాగేష్, పుట్టల సైదులు, పల్లె ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

దేవరకొండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన దేవరకొండ నియోజకవర్గ విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టులు బలంగా ఉన్నంత కాలం పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు కార్మిక వర్గానికి అనేక హక్కులు సాధించబడ్డాయని గుర్తుచేశారు. పాలక ప్రభుత్వాలు ఆయా వర్గాల ప్రజలను విస్మరించి పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, రమావత్ అంజయ్యనాయక్, పల్లె నర్సింహ, తూం బుచ్చిరెడ్డి, పార్లపల్లి కేశవరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

పెద్దవూర: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆయన స్కూల్ బ్యాగులు అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచులు శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సంజీవరెడ్డి, రామకృష్ణనాయక్, నాయకులు ప్రదీప్‌రెడ్డి, మహేష్, నాగార్జున, ప్రసాద్, కోటయ్య, భాస్కర్, లింగస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సంగారం గ్రామపంచాయతీలో డ్రోన్ల సహాయంతో 49ఎకరాల్లో ఉచితంగా రసాయన మందును పిచికారీ చేయించారు.


పెద్దవూర జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీనాయక్

అడవిదేవులపల్లి: అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుందని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు. ఉల్సాయిపాలెం, చిట్యాల, చాంప్లాతండాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని సర్పంచులు నాగేంద్రమ్మ, రమావత్ ప్రియాంక సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కొత్తనందికొండలో ఈజీఎస్ బిల్లులు రాలేదని సర్పంచ్ రమావత్ బాలాజీనాయక్ సమావేశం దృష్టికి తీసుకురాగా... సాంకేతిక కారణాలతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందని తెలిపి, దానిని సరిచేసి ఎఫ్‌టీఓను ఆయనకు అందజేశారు. వైకుంఠధామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, మిషన్ భగీరథ నీరు సరిగా రావడంలేదని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించారు. మండలంలో హరితహారం కింద 1.30లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1.06లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు వివరించారు. మండలంలో 4630 మంది ఉపాధి కూలీలకు వంద శాతం పని దినాలను కల్పించి రూ.1.48కోట్లు అందించినట్లు తెలిపారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం కింద 74 మంది గిరిజనులకు మాడా రుణాలను వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేశామని అధికారులు అన్నారు. బీసీ కార్పొరేషన్ కింద 227 మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, వైస్ ఎంపీపీ కూరాకుల మల్లేశ్వరీ, ఎంపీడీఓ షరీఫ్, ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మర్రెడ్డి, ఎంపీఓ లలిత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

కొండమల్లేపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కొండమల్లేపల్లిలోని హైదరాబాద్ రోడ్డులో గల మల్లెలగట్టు సమీపంలో నివాసం ఉంటున్న నూతనగంటి వాణి ఇంట్లో గురువారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో ఎలక్ట్రిక్ వస్తువులు, వంటగదిలోని వస్తూ సామగ్రి దగ్ధమయ్యాయి. వాణి కుమారుడు కిరణ్ గమనించి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. పట్టణంలో లోఓల్టే.ఈ కారణంగా షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

షాపులో అగ్ని ప్రమాదం

మిర్యాలగూడ అర్బన్: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని షాపు దగ్ధమైన ఘటన మిర్యాలగూడ పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కేఆర్ ఎస్టేట్‌లో గల ఫ్యాన్సీ జనరల్ స్టోర్ యజమాని రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి 10గంటల సమయంలో ఒక్కసారిగా షాపులోంచి మంటలు రావడం గుర్తించిన స్థానికులు షాపు యజమానితో పాటు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది షట్టర్‌ను ఓపెన్ చేయడానికి ప్రయత్నించగా తెరుచుకోలేదు. కట్టర్ సహాయంతో షెట్టర్‌ను తొలగించి మంటలను అదుపులోకి తెచ్చారు. షాపులో ప్లాస్టిక్ కవర్లు, విస్తరాకులు ఉండటంతో మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. కాగా మంటలు పక్కనే ఉన్న షాపులకు మంటలు అంటుకోకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా షాట్ సర్క్యూట్ కారణంగానే షాపులో అగ్ని ప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారులు గుర్తించారు.

మధ్యాహ్న భోజన వసతి కల్పించాలి

చింతపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి రమావత్ లక్ష్మణ్‌నాయక్, వెంకటేశ్ కోరారు. ఈ మేరకు గురువారం చింతపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సాయివంశీ, సభ్యులుగా నితిన్, జీవన్, శివాజీ, రాజేశ్, పవన్, నందిని తదితరులను ఎన్నుకున్నారు.



చింతపల్లి జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మండల అభివృద్ధికి కృషి చేయాలి

చందంపేట: మండల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ పార్వతి, పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి అన్నారు. గురువారం చందంపేట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రైతుల భూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అనంతరం అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రేమలత, రైతు సమితి అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ రాములునాయక్, తహసీల్దార్ రాములు, సాధిక్, ఎంఈఓ సామ్యనాయక్, ఏపీఓ వరలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈఈ రాజునాయక్, శేఖర్, శంకర్‌రావు, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబాలకు పరామర్శ

గుర్రంపోడు: మండలంలోని తేనపల్లి, తానేదార్‌పల్లి, చేపూరు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ నాయకుల కుటుంబాలను గురువారం పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జయవీర్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, జాల చినసత్తయ్యయాదవ్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని పాఠశాలల్లో గురువారం ఏబీవీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యలమల గోపిచంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆకాశ్, మానస, శ్రీకాంత్, హేమ, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని పెద్దబావితండాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జటావత్ జయరాం నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వీర్లపాలెంకు చెందిన రమావత్ వెంకటేశ్వర్లుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2.50 లక్షలు, దామరచర్ల గ్రామానికి చెందిన షేక్ నస్రీన్, పద్మకు రూ.లక్ష చొప్పున మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కులను గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు నివాసంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ యువనేత నల్లమోతు సిద్ధార్థ అందజేసి మాట్లాడారు.

పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని చిల్కమర్రి గ్రామపంచాయతీ పరిధిలోని సూర్యపల్లి గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం ఎంపీడీఓ మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 350 మంది ఓటర్లు ఉన్న గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి కొత్తగా ఏర్పడే గుడిపల్లి మండలంలో చేర్చాలని కోరారు.

స్టేట్ టీచర్స్ యూనియన్ సభ్యత్వ నమోదు

పెద్దవూర: మండల పరిధిలోని నాగార్జునసాగర్, పెద్దవూర, వెల్మగూడెం జెడ్పీహెచ్ఎస్‌ల్లో స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గణపురం భీమయ్య ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కోర్టు కేసులను పరిష్కరించి ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొనకంచి వీరరాఘవులు, మండల అధ్యక్షులు వీరాంజనేయులు, సైదానాయక్, తావుర్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురిపై కేసు

మిర్యాలగూడ అర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో నలుగురిపై కేసు నమోదు చేశామని మిర్యాలగూడ ట్రాఫిక్ ఎస్ఐ మోహన్ పేర్కొన్నారు. వారిని కోర్టులో హాజరు పర్చగా నలుగురికి న్యాయమూర్తి రూ.6100 జరిమానా విధించినట్లు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో కేసీఆర్ విఫలం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ టౌన్: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. కేసీఆర్ వైఫల్యాలను నిరసిస్తూ గురువారం బీజేపీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ శ్యాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధినేని శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం కేసీఆర్ బీసీలు, మైనార్టీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తామంటూ అమలు సాధ్యంకాని హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. వివిధ పథకాలకు అర్హులను ఎంపిక చేసే బాధ్యత ఎమ్మెల్యేలకు అప్పగించడంతో వారు తమకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే ఆయా పథకాలను మంజూరు చేస్తున్నారని అన్నారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇచ్చే ఆర్థికసాయాన్ని రూ.10లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మిర్యాలగూడ నియోజకవర్గ ప్రభారీ లచ్చిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్ నాయక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, అమిరెడ్డి రామచంద్రారెడ్డి, కొండేటి శేఖర్, అంజిరెడ్డి, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, చిల్లంచర్ల అభి తదితరులున్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

దేవరకొండ: సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, నియోజకవర్గ ఇన్‌చార్జి కళ్యాణ్‌నాయక్ డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం దేవరకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్య, గాజుల మురళి, జెల్దా భాస్కర్, సముద్రాల సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని గురువారం చింతపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ శంషాద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేశ్‌యాదవ్, సర్పంచులు బొడ్డు శ్రీనివాస్, దాసోజు బ్రహ్మచారి, ఎంపీటీసీ అనిత, నాయకులు రాజేశ్, బొడ్డు మహేశ్, పర్వతాలు, గణేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిండి మండలంలో..

డిండి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, ఎంపీటీసీ ఏటి.రాధిక, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సింకారు సైదా, జైపాల్, అంజి, రాజు, అమృత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: అర్హులైన వారికి సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పేర్ల జితేందర్, కుంభం యాదగిరిగౌడ్, పాక నగేశ్, భూతరాజు భరత్, ఎండీ జహీర్, గుద్దేటి యాదయ్య, రమావత్ లక్ష్మణ్, నేతాళ్ల భరత్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): కొత్త రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మెండె అనిల్ కుమార్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా తొమ్మిదేళ్ల కాలంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా కట్టకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో నిరుపేదలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాండునాయక్, వెంకటేష్, మోహన్, రాంమూర్తి, రాజు, బాలు, రంజి, రంగా సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ టౌన్: ఆర్ఐ శ్యాంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు


దేవరకొండ: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు


తిరుమలగిరి: తహసీల్దార్ యాదగిరికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు


కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు


డిండి: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు